సాక్షి విశాఖపట్నం

సోమవారం । 8 । సెప్టెంబర్ । 2025

● విశాఖలో మహిళల ప్రపంచ కప్



మహిళల క్రికెట్ ప్రపంచకప్‌కు తొలిసారిగా ఆతిథ్యం ఇవ్వనున్న విశాఖలో ఆదివారం విజేతలకు అందించే ట్రోఫీని ప్రదర్శించారు. ప్రస్తుతం వైఎస్సార్ స్టేడియంలో జరుగుతున్న మహిళల క్రికెట్ లీగ్ సందర్భంగా ఈ ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి సానా సతీష్ మాట్లాడుతూ భవిష్యత్తులో మిథాలీ రాజ్ మెంటార్‌గా వ్యవహరించే సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ ద్వారా గ్రామీణ పాఠశాల స్థాయి క్రీడాకారిణులకు అంతర్జాతీయ అవకాశాలు లభిస్తాయని చెప్పారు. ప్రపంచకప్‌లోని ఐదు మ్యాచ్‌లకు విశాఖ వేదిక కానుంది.

- విశాఖ స్పోర్ట్స్



సంద్రంపై మెరుపుల నృత్యం

సముద్రపుటంచున నిలబడి చూస్తే, ఆకాశం తన మేఘపు మేలి ముసుగులో కళ్లు మూసుకుంది. అలల వెచ్చని స్పర్శకు పులకించిన సంద్రం... ఆకాశం కళ్లు తెరిచే క్షణం కోసం వేచి చూసింది. అంతలోనే ఉరుముల శబ్దాన్ని చీల్చుకుంటూ ఓ మెరుపు పుట్టింది. అది ఆకాశం నుంచి సంద్రం వైపు దూకింది. ఆ మెరపు స్పర్శకు సంద్రం మురిసిపోయింది. అలా ఒకటి కాదు.. రెండు కాదు.. అనంతమైన మెరుపులు ఆకాశం నుంచి సముద్రంలో దూకాయి. అప్పుడు ఉరుముల సవ్వడికి భూమి పరవశించిపోయింది. సముద్రంలో తళతళ మెరిసిన మెరుపులు, వర్షపు చుక్కల జల్లుతో ఆకాశం సంద్రంపై ప్రేమను కురిపించింది. ఆ అద్భుత దృశ్యానికి విశాఖ ఆర్కే బీచ్ వేదికైంది.

– ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

బీచ్ శాండ్‌పై కూటమి కన్ను

- బీచ్ శాండ్ మైనింగ్‌కు తలుపులు తెరిచిన ప్రభుత్వం
- భీమిలిలో 90.15 హెక్టార్లను మైనింగ్ లీజుకి ఇచ్చేందుకు యత్నాలు
- ప్రైవేట్ సంస్థలతో కలిసి సముద్రపు ఇసుక పేరుతో ఖనిజాల దోపిడీకి కుట్ర
- మోనజైట్ అక్రమ రవాణా జరిగే అవకాశం
- భీమిలి పరిసరాల్లో అత్యంత విలువైన ఖనిజాలు
- దేశ ప్రయోజనాలకు ముప్పు కలిగించే మైనింగ్ ఆపాలంటున్న పర్యావరణవేత్తలు



భీమిలి బీచ్

సాక్షి, విశాఖపట్నం : రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత నదీ ఇసుక, నీటి వనరులను దోచుకున్న కూటమి ప్రభుత్వం ఇప్పుడు సాగర తీరంపై దృష్టి సారించింది. బీచ్ శాండ్ మైనింగ్ పేరుతో భీమిలి తీరంలో భారీగా ఖనిజాల అక్రమ రవాణాకు పాల్పడేందుకు కుట్ర పన్నుతోంది. ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ (ఏపీఎండీసీ) ఆధ్వర్యంలో జిల్లాలోని భీమిలి ప్రాంతంలో 90.15 హెక్టార్ల సముద్ర తీరాన్ని ప్రైవేటు సంస్థలకు లీజుకు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని, దీని ద్వారా విలువైన ఖనిజాలు దోపిడీకి గురవడంతో పాటు పర్యావరణానికి తీవ్ర నష్టం జరుగుతుందని పర్యావరణవేత్తలు హెచ్చరిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తమ జేబులు నింపుకోవడానికి ఇలాంటి విధ్వంసకర కార్యకలాపాలకు సిద్ధమవుతోంది. ఇందులో భాగంగానే మైనింగ్ కార్యకలాపాలకు టెండర్లు ఆహ్వానిస్తోంది.

మద్రాస్‌లో మైనింగ్ పేరుతో విధ్వంసం

గతంలో మద్రాసులో బీచ్ శాండ్ మైనింగ్ పేరుతో ప్రైవేటు సంస్థలు సముద్ర తీరాన్ని ధ్వంసం చేసి, దేశ భద్రతకు అవసరమైన ఖనిజాలను అక్రమంగా తరలించాయ. ఆ భారీ కుంభకోణం వెలుగులోకి వచ్చినప్పుడు, మద్రాసు హైకోర్టు తక్షణమే మైనింగ్‌ను నిలిపివేయాలని ఆదేశించి, ప్రభుత్వాలకు పర్యావరణ పరిరక్షణపై హెచ్చరికలు జారీ చేసింది. ఈ అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకోకుండా, ఏపీ ప్రభుత్వం తమ స్వలాభం కోసం పర్యావరణాన్ని పణంగా పెడుతోంది.

మోనజైట్ పేరుతో దోపిడీకి కుట్ర

ఈ ఖనిజాల్లో అణుధార్మిక శక్తి కలిగిన మోనజైట్ ముఖ్యమైనది. దీనిని అణు విద్యుత్ అభివృద్ధికి ఇంధన వనరుగా వినియోగిస్తారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల తెచ్చిన చట్ట సవరణల మేరకు, అణుధార్మికత పరిమితంగా ఉన్న ఖనిజాలను విక్రయించుకోవచ్చని గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీన్ని అడ్డం పెట్టుకొని మోనజైట్ పేరుతో భారలోహాలను పెద్ద ఎత్తున అక్రమంగా తరలించేందుకు కుట్ర జరుగుతోందని, దీనికి ప్రభుత్వం సహకరిస్తుందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ మైనింగ్ వల్ల పర్యావరణానికి, దేశ భద్రతకు తీవ్ర ముప్పు వాటిల్లుతుందని పర్యావరణ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



భీమిలి..ఖనిజాల నిక్షేపం

రాష్ట్రంలోని తీర ప్రాంతాల్లో భీమిలిలోనే అరుదైన, అత్యంత విలువైన ఖనిజాలు ఉన్నాయని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా సర్వేలు వెల్లడించాయి. భీమునిపట్నం, పూడిమడక ప్రాంతాల్లో గార్నెట్, జిర్కోనియం, ఇలిమినెట్, సిలిమినైట్, రూటిల్, లికాక్సిన్, మోనజైట్ వంటి భారలోహాలు ఉన్నట్లు జీఎస్ఐ గుర్తించింది. భీమిలిలోని నిక్షేపాల విలువ దాదాపు రూ.10 వేల కోట్లకు పైగా ఉంటుందని అంచనా. ఈ ఖనిజాలను ఏరోస్పేస్, వైద్య పరికరాలు, అణు రియాక్టర్ల వంటి వ్యూహాత్మక రంగాలలో ఉపయోగిస్తారు.



భీమిలిలో దొరికే ఖనిజాలు

ప్రైవేట్‌కు బీచ్ మైనింగ్ కట్టబెట్టడం దారుణం



శ్రీకాకుళం, విశాఖపట్నం సహా రాష్ట్రంలోని 19 ప్రాంతాల్లో బీచ్ శాండ్ మైనింగ్ కోసం ప్రైవేట్ సంస్థలకు లీజుకివ్వడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఇది దేశ ప్రయోజనాలకు అత్యంత ప్రమాదకరం. కేంద్ర ప్రభుత్వం ఈ విషయాన్ని గుర్తించాలి. తమిళనాడులో బీచ్ శాండ్ మైనింగ్ పేరుతో ప్రైవేట్ సంస్థలు మోనజైట్ వంటి విలువైన ఖనిజాలను అక్రమంగా తరలించిన విషయాన్ని గుర్తుంచుకోవాలి. అణు అభివృద్ధిలో మూడో దశకు ఇంధన వనరుగా ఉపయోగపడే అత్యంత కీలకమైన మోనజైట్‌ను కోల్పోవడం దేశ భద్రతకు పెను ముప్పుగా పరిణమిస్తుంది. అటమిక్ ఎనర్జీ డిపార్ట్‌మెంట్ (డీఏఈ) ఇప్పటికే ఈ అంశంపై ఏపీ ప్రభుత్వానికి బీచ్ శాండ్ మైనింగ్‌కు అనుమతులు ఇవ్వవద్దని లేఖ కూడా రాసింది. కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఈ విషయంపై దృష్టి సారించాలి.

– ఈఏఎస్ శర్మ, కేంద్ర ప్రభుత్వ మాజీ కార్యదర్శి

'స్మార్ట్'లో తప్పుల తడక

- చిరునామాల మార్పు
- పేర్లలో అక్షర దోషాలు
- ఆందోళన చెందుతున్న లబ్ధిదారులు

మహారాణిపేట: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పంపిణీ చేస్తున్న స్మార్ట్ రేషన్ కార్డులు తప్పుల తడకలతో నిండిపోయాయి. ఈ నెల ఒకటో తేదీ నుంచి పంపిణీ ప్రారంభమైన ఈ కార్డుల్లో చిరునామాలు, పేర్లలో అక్షర దోషాలు, వయస్సులో తేడాలు, పిల్లల పేర్లు నమోదు కాకపోవడం వంటి తప్పులు దొర్లాయి.

లబ్ధిదారుల్లో ఆందోళన

స్మార్ట్ రేషన్ కార్డులు కేవలం నిత్యావసరాలకే కాకుండా, ప్రభుత్వ పథకాలు, ఆరోగ్య ప్రయోజనాలకు కూడా ఆధారం కావడంతో, ఈ కార్డుల్లోని తప్పులు ప్రజలకు సమస్యగా మారాయి. లబ్ధిదారుల మొబైల్ నంబర్, ఆధార్ నంబర్, రేషన్ కార్డుకు అనుసంధానం చేయాల్సి ఉంటుంది. వివరాలు సక్రమంగా లేకపోతే ప్రభుత్వ పథకాలకు అనర్హులుగా మారే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కార్డుల్లోని తప్పులను ఎలా సరిదిద్దాలన్న విషయంపై స్పష్టత లేకపోవడంతో కార్డుదారులు అయోమయంలో ఉన్నారు. కంచరపాలెం వారికి వేపగుంట, పెందుర్తి వంటి ప్రాంతాల పేర్లు నమోదవడం, పిల్లల పేర్లు లేకపోవడం వంటి సమస్యలు చాలా ఉన్నాయి. ఈ తప్పులను వెంటనే సవరించాలని కార్డుదారులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



స్మార్ట్ రేషన్ కార్డు

జిల్లాలో 5,17,149 స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీకి సిద్ధం

జిల్లాలో మొత్తం 5,17,149 స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని డీఎస్‌వో భాస్కరరావు తెలిపారు. ఇప్పటికే గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల ద్వారా ఇంటింటికీ పంపిణీ జరుగుతోంది. కార్డులు అందుకోని వారు సంబంధిత రేషన్ డిపోలకు వెళ్లి వేలిముద్రలు వేసి కార్డులు పొందాలని ఆయన సూచించారు. వలస వెళ్లిన వారు కూడా తమ నమోదిత రేషన్ షాపు వద్దే కార్డు తీసుకోవాలని, పోర్టబులిటీ సౌకర్యం ఇప్పటికే అందుబాటులో ఉందని వివరించారు.

నంబరు ప్లేటు మార్చి కోళ్ల వ్యర్థాల తరలింపు

ఐదు వాహనాలను సీజ్ చేసిన జీవీఎంసీ అధికారులు

సింహాచలం: వాహనం నంబర్ ప్లేట్లను మార్చి కోళ్ల వ్యర్థాలను అక్రమంగా తరలిస్తున్న ఐదు వాహనాలను జీవీఎంసీ అధికారులు ఆదివారం గుర్తించారు. పాత అడవివరంలో తనిఖీలు నిర్వహించినప్పుడు ఈ విషయం వెలుగులోకి వచ్చింది. కోళ్ల వ్యర్థాల రవాణాకు జీవీఎంసీ కొన్ని ప్రత్యేక వాహనాలకు మాత్రమే అనుమతులు ఇచ్చింది. అయితే అనుమతి పొందిన వాహనాల నంబర్ ప్లేట్లను అక్రమంగా ఇతర వాహనాలకు మార్చి రవాణా చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ తనిఖీల్లో భాగంగా జీవీఎంసీ వెటర్నరీ అధికారి వాసు, జోన్-8 శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేష్, సిబ్బంది ఓ వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా, అసలు నంబర్ ప్లేటుపై మరో నంబర్ స్టిక్కర్ అతికించి ఉన్నట్లు కనుగొన్నారు. విచారణలో అసలు వాహనం రిపేరుకు రావడంతో దాని నంబర్‌ను మరో వాహనానికి అతికించినట్లు డ్రైవర్ తెలిపాడు. దీంతో అప్రమత్తమైన అధికారులు మొత్తం ఐదు వాహనాలను తనిఖీ చేశారు. వాటిలో రెండు వాహనాలకు మాత్రమే అనుమతులు ఉండగా, మిగిలిన మూడు వాహనాలపై అనుమానం రావడంతో వాటితో సహా మొత్తం ఐదు వాహనాలను ఆరిలోవలోని డంపింగ్ యార్డుకు తరలించి సీజ్ చేశారు. ఇంకా ఎన్ని అనధికారిక వాహనాలు తిరుగుతున్నాయో గుర్తించేందుకు అధికారులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



వాహనానికి అతికించిన స్టిక్కర్

సంపత్ వినాయగర్ హుండీ ఆదాయం లెక్కింపు

మహారాణిపేట: ఆశీలమెట్టలోని శ్రీ సంపత్ వినాయగర్ దేవాలయంలో వినాయక ఉత్సవాల సందర్భంగా వచ్చిన హుండీ ఆదాయం లెక్కింపులో 12 రోజుల్లో రూ. 14,55,243 ఆదాయం లభించింది. ఈ లెక్కింపులో 5 గ్రాముల బంగారం, 101 గ్రాముల వెండి వచ్చినట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి, జిల్లా సహాయ కమిషనర్ డి.వి.వి. ప్రసాద్ తెలిపారు. అంతే కాకుండా విదేశీ కరెన్సీలైన 21 అమెరికా డాలర్లు, 4 ఒమాన్ రియల్స్, 10 కెనడా డాలర్లు, 10 యూరోలు, 10 ఇంగ్లండ్ పౌండ్లు కూడా లభించాయి. లెక్కింపు కార్యక్రమంలో జగన్నాథ స్వామి ఆలయ ఈవో రాజగోపాల్ రెడ్డి పర్యవేక్షించగా, వెంకటేశ్వర సేవా సంఘం సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. లభించిన ఆదాయాన్ని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆశీలమెట్ట బ్రాంచ్‌కు అందజేశారు.

రజకులకు సామాజిక, ఆర్థిక, రాజకీయ ప్రయోజనాలు

రాష్ట్ర మంత్రులు పార్థసారథి, సత్యకుమార్, కొల్లు రవీంద్ర

బీచ్‌రోడ్డు : రజకులకు సామాజిక, ఆర్థిక, రాజకీయ ప్రయోజనాలు కూటమి ప్రభుత్వంలోనే కలుగుతాయని, వారి జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని రాష్ట్ర మంత్రులు కొలుసు పార్థసారథి, సత్యకుమార్ యాదవ్, కొల్లు రవీంద్రలు పేర్కొన్నారు. ఆదివారం వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో జరిగిన రజకుల ఆకాంక్ష సభలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రులు మాట్లాడుతూ, రజకుల సేవలు సమాజానికి ఎంతో ముఖ్యమని, అయితే వారి జీవన పరిస్థితులు ఇంకా మెరుగుపడాల్సి ఉందని అన్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు పార్థసారథి, సత్యకుమార్, కొల్లు రవీంద్ర

కుల వృత్తులను రిజర్వ్ చేయాలని, హోటళ్లు, టూరిస్ట్ రిసార్టులలో దోబీ పనిని హక్కుగా కల్పించడానికి ప్రత్యేక చట్టం తీసుకురావాలని సూచించారు. రుణాల మంజూరులో ప్రత్యేక కోటా ఇవ్వాలని, అధికారులు వారికి సహకరించాలని కోరారు.

త్వరలోనే బీసీ రక్షణ చట్టం తీసుకువస్తామని, గత ప్రభుత్వం తగ్గించిన 34 శాతం రిజర్వేషన్లను తిరిగి పునరుద్ధరిస్తామని మంత్రులు హామీ ఇచ్చారు. అంతకు ముందు సంత్ గాడ్గే, మావిడాల మాచయ్య, వీరనారి చాకలి ఐలమ్మ చిత్రపటాలకు పూలమాలలు వేసి అతిథులంతా గౌరవ వందనం సమర్పించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి రావు, ఏపీ రజక సంక్షేమ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ సి. సావిత్రి, ఎమ్మెల్యేలు పంచకర్ల రమేష్ బాబు, విష్ణుకుమార్ రాజు, వంశీకృష్ణ శ్రీనివాస్, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్. ఈశ్వరరావు, ఏపీ గ్రోవర్స్ ఆయిల్స్ సీడ్స్ – కార్పొరేషన్ చైర్మన్ గండిబాబ్జీ, డీసీసీబీ చైర్మన్ కోన తాతారావులు తదితరులు పాల్గొన్నారు.

బిగ్‌బాస్ హౌస్‌లోకి శ్రీజ

- జీవీఎంసీ అవుట్ సోర్సింగ్ సూపర్‌వైజర్ కుమార్తె ప్రతిభ
- హౌస్‌లో చోటు దక్కించుకున్న శ్రీజ





గోపాలపట్నం: దమ్ము శ్రీజ... ఈ పేరు ఇప్పుడు రాష్ట్రమంతా చర్చనీయాంశంగా మారింది. బిగ్‌బాస్ హౌస్‌లోకి అడుగు పెట్టి, తన దూకుడుతో ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. తన ప్రతిభతో బిగ్‌బాస్‌లో కచ్చితంగా రాణిస్తుందని ఈ ప్రాంతీయులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ నుంచి బిగ్‌బాస్ వరకు..

శ్రీజ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. నెలకు రెండు లక్షలకు పైగా జీతం సంపాదిస్తున్నప్పటికీ, తన ప్రతిభను నిరూపించుకోవడానికి బిగ్‌బాస్‌ను ఒక వేదికగా ఎంచుకున్నారు. ఆడిషన్స్ అనే అగ్నిపరీక్షలో నెగ్గి, ఇప్పుడు ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమయ్యారు.

తండ్రి నిజాయతీ, అంకితభావం

శ్రీజ తండ్రి తండ్రి దమ్ము శ్రీను, జీవీఎంసీ 92వ వార్డులో పారిశుధ్య విభాగంలో అవుట్‌సోర్సింగ్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. ఆయన ప్రజలకు సేవ చేయడంలో ముందుంటారు. వార్డులో ఏ సమస్య ఉన్నా, అది మురుగు కాల్వలైనా, చనిపోయిన వీధి కుక్కలైనా, వెంటనే అక్కడికి వెళ్లి పరిష్కరిస్తారు. ఒక సూపర్‌వైజర్‌గా కాకుండా, ఒక కార్మికుడిలా తన సిబ్బందితో కలిసి పనిచేసే గుణం ఆయనది. కొంత మంది దురభిమానం కారణంగా తోటి కార్మికుడు చేసిన దాడిలో ఒక కన్ను కోల్పోయారు.

శ్రీజకు మద్దతివ్వండి

తమ కుమార్తె శ్రీజకు మద్దతివ్వాలని శ్రీను దంపతులు కోరుతున్నారు. ప్రతీ ఎపిసోడ్‌లో ఆమె ఆట తీరును గమనించి, పూర్తి మద్దతు తెలిపి, ఓట్లు వేయాలని ప్రేక్షకులందరినీ విజ్ఞప్తి చేస్తున్నారు.

● ఆలయాలు మూసివేత



సంపూర్ణ చంద్రగ్రహణాన్ని పురస్కరించుకుని సింహాచలంతో జిల్లాలోని దేవాలయాలను ఆదివారం సాయంత్రం మూసివేశారు. సోమవారం ఉదయం సంప్రోక్షణ అనంతరం 9 గంటల తర్వాత మళ్లీ దర్శనాలు ప్రారంభమవుతాయి.

8లో

సింహాచలంపై మెట్లమార్గం పునరుద్ధరణ పనుల ప్రారంభం

సింహాచలం: గత చందనోత్సవం రోజున గోడ కూలి ఏడుగురు భక్తులు మృతి చెందిన ప్రదేశంలో సింహాచలం దేవస్థానం అధికారులు మెట్లమార్గం పునరుద్ధరణ పనులను ప్రారంభించారు. ప్రసాద్ పథకం పనుల్లో భాగంగా నిర్మించిన గోడ కూలి ప్రమాదం జరగడంతో అప్పటి నుండి ఈ మెట్ల మార్గాన్ని మూసివేశారు. గతంలో ఉన్న ప్రణాళికకు విరుద్ధంగా మెట్ల మార్గాన్ని నిర్మించడంతోనే ప్రమాదం జరిగిందని వైదిక వర్గాలు అప్పట్లో అభ్యంతరాలు వ్యక్తం చేశాయి. ఈ నేపథ్యంలో అక్టోబర్ 2న జరగనున్న విజయదశమి ఉత్సవంలో భాగంగా స్వామివారిని పల్లకిలో కొండ దిగువకు తీసుకెళ్లేందుకు వీలుగా ఈ మెట్ల నిర్మాణం అత్యవసరమని అధికారులు భావించారు. పర్యాటక శాఖ నుంచి స్పందన లేకపోవడంతో, దేవస్థానం సొంతంగా రూ.18 లక్షల వ్యయంతో పనులకు టెండర్ పిలిచి, గడిచిన రెండు రోజుల క్రితం పనులను ప్రారంభించారు. ప్రమాదం జరిగిన చోట గతంలో ఉన్న విధంగానే పకడ్బందీగా మెట్ల మార్గాన్ని నిర్మించి, విజయదశమి నాటికి అందుబాటులోకి తీసుకురావాలని దేవస్థానం అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు.



ప్రమాదం జరిగిన ప్రదేశంలో మెట్లమార్గం ఏర్పాటు చేసేందుకు పనులు చేస్తున్న కార్మికులు

● సూర్యుడ్ని కప్పేసి..మేఘాలు కమ్మేసి..

విశాఖ నగరంపై ఆదివారం అలిగిన మేఘాలు ముసుగు వేసుకున్నాయి. కారుమబ్బుల కౌగిలిలో ఆకాశం ఒదిగిపోయింది. ఉదయం నుంచి ఎండ మండిపోయినా..సాయంత్రం మాత్రం ఆకాశం తన రూపాన్ని మార్చుకుంది. చీకటి తెరలను అలుముకుంది. చంద్రగ్రహణం రాత్రికి బదులు పగలే వచ్చినట్టుగా, మేఘాలు సూర్యుడిని కప్పేసి, నగరాన్ని తమ వశం చేసుకున్నాయి.

- ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖ



నేడు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్

మహారాణిపేట: కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం వరకు అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని ఆయన చెప్పారు. సమస్యలను సమర్పించేవారు తమ వివరాలతో పాటు, గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన రసీదును తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కలెక్టరేట్ ఎదుట నేడు దివ్యాంగుల నిరసన

మహారాణిపేట: దివ్యాంగుల పింఛన్లలో కోత విధించడం, శల్య పరీక్షల పేరుతో వేధింపులకు గురిచేయడాన్ని నిరసిస్తూ.. దివ్యాంగుల హక్కుల పోరాట సమితి సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించనుంది. ప్రభుత్వం దివ్యాంగుల పట్ల చిన్నచూపు చూస్తోందని సమితి జిల్లా అధ్యక్షుడు అక్కిరెడ్డి అప్పారావు ఆరోపించారు. కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత పింఛన్ల సంఖ్యను తగ్గించేందుకు పలు చర్యలు తీసుకుందని, సదరం రీ–వెరిఫికేషన్, రీ–అసెస్మెంట్ పేరుతో మళ్లీ వైద్య పరీక్షలకు హాజరు కావాలని ఒత్తిడి చేస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో పింఛన్ పొందిన వారు ఇప్పుడు అనర్హులుగా మారడం విడ్డూరంగా ఉందని, వైకల్యం శాతం 40 కంటే తక్కువగా ఉందని చెప్పి చాలా మంది పింఛన్లను తొలగించారన్నారు. దివ్యాంగులను మానవతా దృక్పథంతో ఆదుకోవాల్సిందిగా కోరుతూ ఈ నిరసనను చేపట్టనున్నట్లు తెలిపారు.

జిల్లా స్విమ్మింగ్ సంఘం నూతన కార్యవర్గం

విశాఖ స్పోర్ట్స్: జిల్లా స్విమ్మింగ్ సంఘం నూతన కార్యవర్గం ఆదివారం ఎంపికైంది. స్థానికంగా జరిగిన సమావేశంలో సభ్యులు ఈ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సంతోష్ కుమార్, కార్యదర్శిగా శ్రీరామమూర్తి, కోశాధికారిగా రఘునాథ్ ఎంపికయ్యారు. వీరితో పాటు ఐదుగురు ఉపాధ్యక్షులు, ఐదుగురు సంయుక్త కార్యదర్శులు, ఏడుగురు సభ్యులను కూడా ఎంపిక చేశారు. ఈ నూతన కార్యవర్గం నాలుగేళ్లపాటు జిల్లాలో స్విమ్మింగ్ అభివృద్ధికి కృషి చేయనుంది.

కేజీహెచ్‌కు జబ్బు

- వార్డుల్లో అధ్వాన పరిస్థితులు
- కంపుకొడుతున్న మరుగుదొడ్లు
- అపరిశుభ్రంగా ఆస్పత్రి పరిసరాలు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం



ఆస్పత్రి పరిసరాల్లో పేరుకుపోయిన చెత్త



రోగుల కోసం ఉపయోగించే స్ట్రెచర్‌ను ఇతర అవసరాల కోసం వినియోగిస్తున్న సిబ్బంది



మందులు ఇచ్చే కౌంటర్ వద్ద వేచి ఉన్న రోగులు(ఫైల్)

మహారాణిపేట: ఉత్తరాంధ్ర ఆరోగ్య ప్రదాయిని కేజీహెచ్ సమస్యలకు నిలయంగా మారింది. వ్యాధి నయం చేసుకుందామని వచ్చే రోగులు.. ఇక్కడి అస్తవ్యస్త పరిస్థితులతో మరింత అనారోగ్యానికి గురవుతున్నారు. ఓపీ టికెట్ కోసం నిరీక్షణతో మొదలయ్యే ఈ నరకం.. వార్డులో చేరిన తర్వాత కూడా కొనసాగుతూనే ఉంది. పెరిగిన రోగుల సంఖ్యకు అనుగుణంగా సౌకర్యాలు పెంచకపోగా.. ఉన్నవి కూడా కనీస స్థాయిలో లేకపోవడంతో పేదలకు వైద్యం అందని ద్రాక్షలా మారింది.

ఓపీ నుంచి వార్డు వరకు అవస్థలే

ఉత్తరాంధ్ర, గోదావరి జిల్లాలతో పాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ తదితర ప్రాంతాల నుంచి రోగులు ఇక్కడికి వస్తుంటారు. ప్రతిరోజూ 1,500 నుంచి 2,200 మంది వరకు ఓపీ నమోదవుతోంది. 300 నుంచి 600 మంది ఇన్ పేషెంట్లుగా చేరుతుంటారు. అయితే 1,187 పడకలున్న ఈ ఆస్పత్రిలో రోగుల ప్రవేశం నుంచే కష్టాలు మొదలవుతాయి. ఓపీ టికెట్ కోసం గంటలకొద్దీ క్యూలో నిలబడాలి. ఆ తర్వాత వైద్యుడిని కలవడానికి మరో గంటకు పైగా నిరీక్షించక తప్పదు. క్యాజువాలిటీ, కార్డియాలజీ, ఆర్థోపెడిక్, ప్రసూతి, చిన్నపిల్లల వార్డులతో సహా ప్రతి విభాగంలోనూ రోగుల బారులు తీరిన దృశ్యాలు సర్వసాధారణం. వైద్యుల కొరత ఈ సమస్యను మరింత తీవ్రతరం చేస్తోంది.

మందుల కొరతతో మరో గండం

గతంలో 30 రోజులకు సరిపడా మందులు ఇచ్చే చోట.. నేడు కేవలం వారానికి సరిపడా మందులతోనే సరిపెడుతున్నారు. దీంతో రోగులు ప్రతి వారం మందుల కోసం గంటల తరబడి క్యూల్లో నిలబడాల్సి వస్తోంది. ఫార్మసీ కౌంటర్లలో మొత్తం 600 రకాల మందులు ఉండాల్సి ఉండగా.. ప్రస్తుతం 500 రకాలే అందుబాటులో ఉన్నాయి. వైద్యులు రాసిన చీటీలో ఆరు మందులుంటే.. మూడు మాత్రమే ఇచ్చి మిగతావి బయట కొనుక్కోవాలని సిబ్బంది చెబుతున్నారు. ఉచిత వైద్యం కోసం వచ్చే పేదలకు ఇది పెను భారంగా మారింది.

కొరవడిన పర్యవేక్షణ

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆస్పత్రిలో పర్యవేక్షణ పూర్తిగా లోపించిందని, వైద్య సేవలు క్షీణించాయని రోగులు ఆరోపిస్తున్నారు. గతంలో అందిన స్థాయిలో కూడా ఇప్పుడు సేవలు అందడం లేదని, అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఈ దుస్థితి దాపురించిందని వాపోతున్నారు. ప్రజారోగ్యానికి భరోసా ఇవ్వాల్సిన ఆస్పత్రే ఇలా రోగగ్రస్తంగా మారడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. కేజీహెచ్‌లో ప్రస్తుతం ఉన్న సమస్యలను పరిష్కరించడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

పనిచేయని పరికరాలు

కేజీహెచ్‌లో వైద్య పరికరాల లభ్యత కూడా పెద్ద సమస్యగా మారింది. రోగులను ల్యాబ్‌కు, సీటీ స్కాన్, ఎక్స్‌రే వంటి పరీక్షలకు తీసుకెళ్లడానికి వీల్‌చైర్లు, స్ట్రెచర్లు అందుబాటులో ఉండటం లేదు. దీంతో రోగుల బంధువులే వారిని మోసుకెళ్లాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. ఆస్పత్రిలోని 217 ఏసీలకు గాను 90 మరమ్మతులకు గురయ్యాయి. కీలకమైన ఆర్టీరియల్ బ్లడ్ గ్యాస్ (ఏబీజీ) పరీక్షలకు అవసరమైన రీజెంట్స్ లిక్విడ్ లేకపోవడంతో గత కొద్ది రోజులుగా 16 మిషన్లు మూలనపడ్డాయి. దీంతో కిడ్నీ, ఊపిరితిత్తుల వ్యాధిగ్రస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ఆస్పత్రిలో 26కిపైగా విభాగాలున్నాయి. పెరుగుతున్న రోగులు సంఖ్యకు అనుగుణంగా వార్డులు, పడకల సంఖ్య పెంచాల్సి ఉండగా ఆ దిశగా ఎలాంటి చర్యలు కనిపించడం లేదు.

పారిశుధ్యం అస్తవ్యస్తం



ట్యాప్‌లు లేని కుళాయిలు, తలుపులేని మరుగుదొడ్లు

ఆస్పత్రిలోని చాలా వార్డులు అపరిశుభ్రతకు అడ్డాగా మారాయి. ఎక్కడ పడితే అక్కడ పేరుకుపోయిన చెత్తతో దుర్గంధం వెదజల్లుతోంది. ఇక మరుగుదొడ్ల పరిస్థితి మరింత అధ్వానం. చాలా కుళాయిలకు ట్యాప్‌లు లేకపోవడంతో నీరు నిరంతరం వృధాగా పోతోంది. దీంతో రోగులు, వారి సహాయకులు వాటర్ బాటిళ్లతో వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. కొన్నిచోట్ల రోగులు కుక్కలతో కలిసి ఉండాల్సిన దయనీయ పరిస్థితులు నెలకొన్నాయి. పర్యవేక్షణ లోపం కారణంగా పారిశుధ్య వ్యవస్థ పూర్తిగా పడకేసింది.

● చంద్రగ్రహణం ఎఫెక్ట్

మూతపడిన ఆలయాలు

- నిర్మానుష్యంగా మారిన సింహగిరి
- నేడు దర్శనాలు పునఃప్రారంభం

సింహాచలం/కొమ్మాది/డాబాగార్డెన్స్/మహారాణిపేట: సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగా ఆదివారం నగరంలోని ప్రముఖ ఆలయాలన్నీ మూతపడ్డాయి. భక్తులతో నిత్యం రద్దీగా ఉండే ఆలయ ప్రాంగణాలు నిర్మానుష్యంగా మారాయి. గ్రహణం ముగిసిన అనంతరం సంప్రోక్షణ పూజలు నిర్వహించి, సోమవారం తిరిగి భక్తులకు దర్శన సౌకర్యం కల్పించనున్నట్టు ఆలయ అధికారులు తెలిపారు.

వెలవెలబోయిన సింహగిరి

చంద్రగ్రహణం ప్రభావం శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి క్షేత్రంపై స్పష్టంగా కనిపించింది. సాధారణంగా ఆదివారం భక్తులతో కిటకిటలాడే సింహగిరి పూర్తిగా నిర్మానుష్యంగా మారింది. ఆదివారం ఉదయం 11.30 గంటల వరకే భక్తులకు అప్పన్న దర్శనాన్ని కల్పించారు. అనంతరం మధ్యాహ్నం 2.25 గంటలకు అర్చకులు ఆలయ కవాట బంధనం (తలుపులు మూసివేత) చేశారు. దీంతో మాడ వీధులు, దర్శన క్యూలు, ప్రసాదాల విక్రయశాలలు, కేశఖండనశాల, గంగధార మార్గం, ఘాట్ రోడ్డు, బస్టాండ్ వంటి ప్రాంతాలన్నీ ఖాళీగా దర్శనమిచ్చాయి. అంతకుముందు స్వామికి రాజభోగం, మధ్యాహ్నం నిర్వహించాల్సిన పవళింపుసేవ, పౌర్ణమి తిరువీధి, రాత్రి ఆరాధన, పవళింపు సేవలను వరసగా నిర్వహించారు. సోమవారం తెల్లవారుజామున 3 గంటలకు ఆలయాన్ని తెరిచి, గ్రహణ సంప్రోక్షణ పూజలు నిర్వహిస్తారు. అనంతరం స్వామికి ప్రత్యేక పూజలు, హోమాలు జరిపి ఉదయం 8 గంటల నుంచి భక్తులకు యథావిధిగా దర్శనాలు కల్పిస్తామని ఆలయ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు తెలిపారు.

మూతపడిన ఇతర ప్రధాన ఆలయాలు

అలాగే బురుజుపేటలోని శ్రీ కనకమహాలక్ష్మి ఆలయాన్ని మధ్యాహ్నం 2 గంటలకు మూసివేశారు. సోమవారం ఉదయం 5 గంటలకు సంప్రోక్షణ పూజలు చేసి, ఉదయం 7 గంటల నుంచి దర్శనాలు పునఃప్రారంభిస్తామని ఆలయ ఈవో కె.శోభారాణి తెలిపారు. ఆశీలమెట్టలోని సంపత్ వినాయగర్ ఆయాన్ని ఉదయం 11 గంటలకే మూసివేశారు. సోమవారం ఉదయం 5 గంటలకు మహా సంప్రోక్షణ జరిపి, 7 గంటల నుంచి సర్వదర్శనాలకు అనుమతిస్తామని ఈవో డి.వి.వి.ప్రసాదరావు తెలిపారు. రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి (టీటీడీ) ఆలయాన్ని మధ్యాహ్నం 1.20 గంటలకు మూసివేశారు. సోమవారం ఉదయం సంప్రోక్షణ అనంతరం దర్శనాలు ప్రారంభమవుతాయని ఆలయ ఏఈవో జగన్మోహనాచార్యులు తెలిపారు. అన్నంరాజునగర్‌లోని శ్రీ అష్టలక్ష్మీ ఆలయాన్ని మధ్యాహ్నం 12 గంటలకు మూసివేశారు. సోమవారం ఉదయం 7.30 గంటలకు సంప్రోక్షణ పూజల తర్వాత భక్తులను అనుమతిస్తామని ఆలయ ప్రధాన అర్చకుడు చామర్తి శ్రీధర స్వామి తెలిపారు. అలాగే అంబికాబాగ్‌లోని సీతారామచంద్రస్వామి ఆలయం, ఇసుకకొండ సత్యనారాయణ స్వామి ఆలయం, జగన్నాథస్వామి ఆలయం, దుర్గాలమ్మ ఆలయం తదితర ఆలయాలన్నీ మూసివేసి, సోమవారం ఉదయం సంప్రోక్షణ కార్యక్రమాల తర్వాత తిరిగి తెరవనున్నట్లు అధికారులు వెల్లడించారు.



మూతపడిన టౌన్‌కొత్తరోడ్డు జగన్నాథస్వామి ఆలయం



అప్పన్న ఆలయ భోగమండపం తలుపులు మూసివేస్తున్న అర్చకులు, సిబ్బంది



మూసివేసిన శ్రీ సంపత్ వినాయగర్ ఆలయం



రుషికొండలోని శ్రీవారి ఆలయాన్ని మూసివేస్తున్న అర్చకులు, నిర్వాహకులు



కనకమహాలక్ష్మి ఆలయాన్ని మూసివేస్తున్న అర్చకులు, ఆలయ సిబ్బంది



మూతపడిన అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయం

ముగిసిన ఫుడ్ ఫెస్టివల్



ఫుడ్ ఫెస్టివల్‌కు హాజరైన జనం

ఆరిలోవ: బీచ్‌రోడ్డులోని ఎంజీఎం గ్రౌండ్స్‌లో మూడు రోజుల పాటు జరిగిన ఫుడ్ ఫెస్టివల్ ఆదివారంతో ముగిసింది. ఏపీ టూరిజం, హెచ్‌ఆర్‌ఏఏపీ, టూరిజం అండ్ ట్రావెల్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ, వీహెచ్‌ఎంఏ, ఈఎంఏ, ఏపీ చాంబర్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 5న ఈ ఫెస్టివల్ ప్రారంభమైంది. ఫెస్టివల్‌లో భాగంగా 45కు పైగా ఫుడ్ స్టాల్స్ ఏర్పాటు చేయగా, మూడు రోజుల్లో వేలాది మంది సందర్శించినట్లు నిర్వాహకులు తెలిపారు. వచ్చే ఏడాది 2026లో మరింత ఎక్కువ స్టాల్స్‌తో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, టూరిజం శాఖ అధికారులు జె.మాధవి, జగదీష్ పాల్గొన్నారు.

మద్యం మత్తులో ట్రాఫిక్ పోలీసులపై దాడి

మద్రిపాలెం: మద్యం మత్తులో ఉన్న ఓ వ్యక్తి ట్రాఫిక్ పోలీసులతో వాగ్వాదానికి దిగి, వారిపై దాడికి పాల్పడిన ఘటన కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి మురళీనగర్ నుంచి కంచరపాలెం మెట్టుకు వెళ్తున్న కోడి మహేష్ మద్యం మత్తులో మరో వ్యక్తితో గొడవ పడుతున్నాడు. ఇది గమనించిన స్థానికులు ట్రాఫిక్ పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాస్, ఏఎస్ఐలు బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్ష చేస్తుండగా.. మహేష్ వారిపై దుర్భాషలాడి తిరగబడ్డాడు. పోలీస్ పెట్రోలింగ్ వాహనం డ్రైవర్ అడ్డుకోవడానికి ప్రయత్నించగా, అతడిపై దాడి చేశాడు. దీంతో ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాస్ కంచరపాలెం సీఐ రవికుమార్‌కు ఫిర్యాదు చేశారు. సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మిత్రుల్ని మింగేసిన మేహాద్రి



లక్ష్మణ్ మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు



శేఖర్ మృతదేహం

పెందుర్తి, చినముషిడివాడ ప్రాంతాల్లో విషాదం

పెందుర్తి: కళాశాలకు సెలవు కావడంతో కాలక్షేపం కోసం మేహాద్రిగెడ్డ రిజర్వాయర్‌కు ఆదివారం వెళ్లిన ఇద్దరు మిత్రులు ప్రమాదశాత్తు నీట మునిగి మృత్యువాత పడ్డారు. నీటిలో పడిన చెప్పును తీసుకునే క్రమంలో ఒకరిని కాపాడబోయి మరొకరు అశువులు బాసిన ఘటన పెందుర్తి, చినముషిడివాడ ప్రాంతాల్లో తీవ్ర విషాదం నింపింది.

పెందుర్తి జీఎన్ఎన్‌యూఆర్‌ఎం కాలనీకి చెందిన బల్లంకి శేఖర్(18), చినముషిడివాడ కాంతినగర్ సమీపంలోని ఆక్సిజన్ కాలనీకి చెందిన యాడాడ లక్ష్మణ్‌కుమార్(18)లు స్నేహితులు. ఆదివారం ఉదయం సోదరుడు బల్లంకి వాసుతో కలిసి శేఖర్, లక్ష్మణ్‌కుమార్ మేహాద్రి గెడ్డకు వెళ్లారు. లక్ష్మణ్ మేహాద్రి ఒడ్డున కూర్చుని చెప్పులు నీటిలోకి విసురుతూ ఆడుతున్నాడు. అది లోపలికి వెళ్లడంతో దాన్ని తీసేందుకు నీటిలోకి దిగిన శేఖర్ నాచు కారణంగా జారి, నీటిలో పడిపోయాడు. అతడ్ని కాపాడే ప్రయత్నంలో లక్ష్మణ్ కూడా జారిపోయాడు. అక్కడే ఉన్న శేఖర్ అన్నయ్య బల్లంకి వాసు వారిని కాపాడేందుకు ప్రయత్నిస్తూ అతడు కూడా నీటిలో మునిగిపోయాడు. ఈ ఘటనను చూసిన సమీపంలోని ఓ వ్యక్తి వీరిని కాపాడేందుకు విశ్వప్రయత్నం చేశారు. అయితే వాసు చెయ్యి జారిపోవడంతో శేఖర్, లక్ష్మణ్ రిజర్వాయర్‌లో మునిగిపోయారు. వాసు ప్రమాదం నుంచి బయటపడ్డాడు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పెందుర్తి సీఐ కె.వి. సతీష్‌కుమార్ హుటాహుటిన తన బృందంతో ఘటనాస్థలికి చేరుకున్నారు. గజ ఈతగాళ్లను రంగంలోకి దించి గాలించారు. గల్లంతైన శేఖర్, లక్ష్మణ్‌ల ఆచూకీ వెంటనే లభించినప్పటికీ అప్పటికే ఇద్దరూ మృతి చెందారు. మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. సీఐ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు జరుగుతోంది.

కుటుంబాల్లో తీరని విషాదం

యాడాడ సూరిబాబు, లక్ష్మి దంపతులకు ఇద్దరు కుమారులు. సూరిబాబు ఎలక్ట్రికల్ పనులు చేస్తుండగా, పెద్దకుమారుడు మన్మధరావు బిగ్ బాస్కెట్‌లో పనిచేస్తూ, తమ్ముడు లక్ష్మణ్‌ను చదివిస్తున్నారు. జీఎన్ఎన్‌యూఆర్‌ఎం కాలనీలో నివాసం ఉంటున్న బల్లంకి మహాలక్ష్మి భర్త బంగార్రాజు మరణించాడు. ఇద్దరు కుమారుల(వాసు, శేఖర్)తో కలిసి స్థానికంగా చిన్న పాన్‌షాప్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. చేతికి అంది వస్తారనుకున్న బిడ్డలు మరణించడంతో ఆయా కుటుంబాల్లో తీరని విషాదం నెలకొంది. అత్యంత ప్రమాదకరమైన మేహాద్రి రిజర్వాయర్‌లో వరుసగా ప్రమాదాలు జరుగుతున్నా, తగిన పర్యవేక్షణ లేకపోవడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

వినాయక ఉత్సవాల పొడిగింపు

- పూర్ణా మార్కెట్‌లో పెరిగిన ట్రాఫిక్
- ప్రజల నుంచి భిన్నాభిప్రాయాలు



పూర్ణామార్కెట్ వద్ద రహదారిపై ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం మండపం

జగదాంబ: పూర్ణామార్కెట్‌లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహ దర్శనాలను నిర్వాహకులు మరో ఆరు రోజుల పాటు పొడిగించడం చర్చనీయాంశంగా మారింది. వినాయక చవితి సందర్భంగా ఈ ఏడాది ఏర్పాటు చేసిన గణనాథుడి విగ్రహాలను చంద్ర గ్రహణం లోపే నిమజ్జనం చేయాలని పండితులు సూచించిన సంగతి తెలిసిందే. అయితే పూర్ణామార్కెట్‌లో ఉత్సవాలను పొడిగించడంపై భక్తులు, ప్రజల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. చంద్రగ్రహణం తర్వాత నిమజ్జనాన్ని చేయడం సంప్రదాయానికి విరుద్ధమని కొందరు అభిప్రాయపడుతున్నారు. ఈ పొడిగింపు కారణంగా మార్కెట్ పరిసరాల్లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని, రహదారి మధ్యలో భారీ వేదికలు, బారికేడ్లు ఏర్పాటు చేయడంతో వినియోగదారులు, వాహనచోదకులు, చిరువ్యాపారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పలువురు వాపోతున్నారు. పండగ సంప్రదాయాలను గౌరవిస్తూనే, ప్రజా సౌకర్యాన్ని కూడా దృష్టిలో ఉంచుకోవాలని.. ఈ విషయంలో అధికారులు జోక్యం చేసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


వైద్య విద్య ప్రైవేటీకరణపై ‘విదసం’ నిరసన

సీతంపేట: ప్రభుత్వ మెడికల్ కళాశాలలను పీపీపీ విధానంలోకి మార్చడం ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలను వైద్య విద్యకు దూరం చేయడమేనని విస్తృత దళిత సంఘాల ఐక్య వేదిక (విదసం) కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు విమర్శించారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఆదివారం అంబేడ్కర్ భవన్‌లో విదసం సభ్యులు ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటరావు మాట్లాడుతూ, ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల మెడికల్ సీట్ల రిజర్వేషన్‌లో 50 శాతం కోత పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కొత్తగా అందుబాటులోకి వచ్చిన 2,400 సీట్లలో కేవలం 1,200 సీట్లు మాత్రమే కన్వీనర్ కోటా కింద ఉంటాయని, మిగిలిన సీట్లను ప్రైవేట్ యాజమాన్యాలు కోట్లకు అమ్ముకునే అవకాశం కల్పించారని ఆయన ఆరోపించారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లను రద్దు చేస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం, ఇప్పుడు అంతకంటే ప్రమాదకరమైన పీపీపీ విధానాన్ని తీసుకొచ్చి మొత్తం 17 మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరించడం దారుణమని ఆయన ప్రశ్నించారు. ఈ విధానం వల్ల తెల్ల రేషన్ కార్డులు లేని పేద విద్యార్థులు కన్వీనర్ కోటాలో సీటు పొందినా ఏటా రూ.12 నుంచి రూ.15 లక్షలు చెల్లించాల్సి వస్తుందని ఆయన అన్నారు. ప్రభుత్వం ఈ పీపీపీ విధానాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసింది. కార్యక్రమంలో విదసం ప్రతినిధులు జాజి ఓంకార్, సోడదాసి సుధాకర్, బూల భాస్కరరావు, గుడివాడ ప్రసాద్, ఇతర కార్యకర్తలు పాల్గొన్నారు.

సందడిగా సండేస్ ఆన్ సైకిల్స్

తాటిచెట్లపాలెం: ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా, ఈస్ట్‌కోస్ట్‌రైల్వేలోని వాల్తేర్ డివిజన్‌లో ‘సండేస్ ఆన్ సైకిల్స్’ అనే కొత్త కార్యక్రమాన్ని డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోహ్రా ప్రారంభించారు. ప్రతిరోజూ అరగంట వ్యాయామం చేయడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఈ కార్యక్రమం ఉద్దేశం. ఈ సందర్భంగా డీఆర్ఎం, రైల్వే ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు డీఆర్ఎం నివాసం నుంచి డివిజన్ కార్యాలయం వరకు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి ముందు, ఈస్ట్‌కోస్ట్‌రైల్వే వుమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు జ్యోత్స్నా బోహ్రా ఆధ్వర్యంలో యోగా కార్యక్రమం జరిగింది. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల మానసిక ఒత్తిడిని తగ్గించడానికి ఈ కార్యక్రమాలు ఉపయోగపడతాయని డీఆర్ఎం తెలిపారు. యోగా, జుంబా, స్కిప్పింగ్ రోప్ వంటి కార్యక్రమాలను కూడా ఇందులో భాగం చేశారు. స్పోర్ట్స్ ఆఫీసర్ ఎం.హరనాథ్, జనరల్ సెక్రటరీ ఎస్. ఉష ఈ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

జూలో కూనల కనువిందు







ఆరిలోవ: ఇందిరాగాంధీ జూలాజికల్ పార్కులో వన్యప్రాణుల సంతానోత్పత్తి కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. మూడు నెలల కిందట పలు జంతువులు, పక్షులు పిల్లలకు జన్మనివ్వగా, తాజాగా మరికొన్ని వన్యప్రాణులకు పిల్లలు పుట్టాయి. ఇటీవల జూలో రెండు చౌసింగాలు (ఒక మగ, ఒక ఆడ), ఒక మగ కృష్ణ జింక పిల్ల, రెండు బ్లూ గోల్డ్ మకావ్ పక్షులు జన్మించాయని జూ క్యూరేటర్ జి. మంగమ్మ ఆదివారం తెలిపారు. తల్లీపిల్లలు అన్నీ సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నాయని ఆమె పేర్కొన్నారు. ప్రస్తుతం చౌసింగా, కృష్ణ జింక పిల్లలు వాటి ఎన్‌క్లోజర్‌లలో తల్లుల చెంత ఉత్సాహంగా ఆడుకుంటూ సందర్శకులకు కనువిందు చేస్తున్నాయి.

ఉత్కంఠ పోరు.. టైటాన్స్ జోరు



విశాఖ స్పోర్ట్స్: ప్రో కబడ్డీ లీగ్(పీకేఎల్) 12వ సీజన్ విశాఖ క్రీడాభిమానులకు అసలైన పండగ వాతావరణాన్ని తెచ్చిపెట్టింది. పోర్ట్ ఇండోర్ స్టేడియం ఆదివారం అభిమానులతో కిక్కిరిసి.. వారి కేరింతలతో దద్దరిల్లింది. సొంతగడ్డపై ఆడుతున్న తెలుగు టైటాన్స్ అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకుంది. బెంగాల్ వారియర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 44–34 తేడాతో ఘన విజయం సాధించి, స్థానిక అభిమానులను ఆనందంలో ముంచెత్తింది. కెప్టెన్ విజయ్ మాలిక్ (11 పాయింట్లు), ఆల్ రౌండర్ భరత్ (12 పాయింట్లు) అద్భుతమైన రైడింగ్‌తో జట్టుకు వెన్నుదన్నుగా నిలిచారు. ఆ తర్వాత జరిగిన మరో మ్యాచ్ అభిమానులను మునివేళ్లపై నిలబెట్టింది. దబాంగ్ ఢిల్లీ, జైపూర్ పింక్ పాంథర్స్ మధ్య జరిగిన పోరు ఆద్యంతం హోరాహోరీగా సాగింది. చివరి క్షణం వరకు విజయం ఎవరిదో తేలని ఈ మ్యాచ్‌లో.. కేవలం ఒక్క పాయింట్ (36–35) తేడాతో దబాంగ్ ఢిల్లీ థ్రిల్లింగ్ విక్టరీని నమోదు చేసింది. ఢిల్లీ కెప్టెన్ అషుమాలిక్ ఏకంగా 21 పాయింట్లతో ఒంటిచేత్తో జట్టును గెలిపించాడు. ఈ ఉత్కంఠభరితమైన మ్యాచ్‌లతో విశాఖలో పీకేఎల్ ఫీవర్ తారస్థాయికి చేరింది. సోమవారం రాత్రి 8 గంటలకు హర్యానా స్టీలర్స్‌తో బెంగళూర్ బుల్స్ జట్టు తలపడనుండగా, రాత్రి 9 గంటలకు పునేరి పల్టన్‌తో పాట్నా పైరేట్స్ ఢీకొట్టనుంది.

సాక్షి క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

I, YERRANNA DUGGAPU, F/o. Manas (given name) Residing at D.No.31-30-115, Kasipalem, Vadlapudi (PO), Visakhapatnam - 530046. MANAS Holding Passport No. X6097928 issued at Riyadh on 18/04/2023, announced to chane my son name as MANAS (given name) & DUGGAPU (Surname). for all future purposes.

CHANGE OF NAME

I, SARAGADAM UDAY KUMAR Gandhi, S/o Saragadam Narasinga Rao, residing at H.No. 6-43/2, Rathi Cheruvu, Pendurthi, Pendurthi Mandalam, Visakhapatnam -531173, AP. I have change my name from SARAGADAM UDAY KUMAR (Old Name) to SARAGADAM UDAY KUMAR GANDHI (New Name) for all purposes vide affidavit No. 8759, dt: 04-09-2025.

Services

GOLD LOANS

■ లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 14303]

Wanted

■ ప్రముఖ సెక్యూరిటీ సంస్థనందు విశాఖపట్నం సిటీ, గాజువాక ఆటోనగర్‌లో పనిచేయుటకు అనుభవం గల 10th or above పాసైన సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. వివరాలకు సంప్రదించండి. ✆ : 95023 77757 [V- 2861]

సాక్షి క్లాసిఫైడ్స్

లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం-16.

విశాఖపట్నం, అనకాపల్లి జిల్లా + అల్లూరి జిల్లా : నాలుగు లైన్లు రూ. 475/- అదనపు లైను రూ. 100/- + 5% జి.ఎస్.టి. అదనం.

మీ ప్రాంతంలోని మా ప్రతినిధులను సంప్రదించండి:

మురళీనగర్, మాధవధార	:90101 33346
NAD, కంచరపాలెం	:90108 10033
గోపాలపట్నం, పెందుర్తి	:70759 89701
సీతమ్మధార, ద్వారకానగర్	:90100 55116
డాబాగార్డెన్స్, జగదాంబ / MVP కోలనీ, మద్దిలపాలెం	:90101 96663
గాజువాక	:97059 33394

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.